# బాండెడ్ లేబర్

కీ ... కీ.... గ్రుమని చప్పుడవుతోంది. కర్కశంగా, ఆ ధ్వని వింటుంటే ఒళ్ళు గలతరిస్తోంది. నాంచారయ్య చర్నాకోలు పట్టుకుని నిర్దాక్షిణ్యంగా ఎద్దును బాత్తుంటే 'అమ్మో' అనాలని పించింది. తవ వీపు మీద కొడుతున్నట్టుగా వుంది. చివాలున లేచి షోలేలో జైలర్‌లాగ పళ్ళు బిగించి, కళ్ళుతిప్పేసి తల విదిలించేస్తూ శరీరాన్ని వణికించేస్తూ భూమిమీద గట్టిగా నిల బడ్డాడు రాజశేఖరం.

ఒక్క అంగలో కిటికి దగ్గరకు వెళ్ళి నుదురు కిటికీ చువ్వలకు తగిలేటట్టుగా వంగి చూస్తూన్నాడు, అదే ఎద్దు, ఆదే గానుగచుట్టూ తిరుగుతోంది. ఎద్దుమెడ కాడికి బాగా ఒరుసుపోయి యింతెత్తు వుబ్బింది. బరువుగా మొండిగా అడుగు తీసి అడుగువేస్తూ అంత బరువును బలవంతాన లాగుతోంది. కాలిగిట్టలు జారి ఒక్కసారి చప్పున కిందికు వంగింది, నాంచారయ్య ఎద్దుతోక మెలేసి చర్నాకోలు కర్రతో మొహం

మీది మొట్టుతున్నాడు. మళ్ళీసాఫీగా లేచి తలవూపుతూ కళ్ళార్పుతూ మెల్లి మెల్లిగా సాగుతోంది. ఇరుసు ఒక పాళంలో తిరుగుతున్నప్పుడు కీచుమని శబ్దం వస్తోంది, ఆ ధ్వని మహా దారుణంగానూ భయంగానూ వినిపిస్తోంది. చప్పున కిటికీ తలుపులు వేసేసి తన మెడను కుడిచేత్తో ఆటూ యిటూ రాస్తూ అమ్మయ్య అని పెద్దగా నిట్టూర్చాడు రాజశేఖరం.

ఎప్పుడూ చూస్తూ వుండేది, ప్రతి రోజువింటూ వుండేది. ఆ దృశ్యం, ఆ ధ్వని. కాని యివ్వాళవుతే రాజశేఖరానికి వింతగా తోస్తోంది. ఏమేమిటో ఆలోచనలు మెదడులో మెరుపుల్లాగ వచ్చి పోతున్నాయి. ఏమిటా యీ జీవితం అని కొంచెం వేదాంతంలోకి పోయాడు, ఎలాంటి వాణ్ణి ఎలా అయి పోయాను. ఆశ్చర్యపోతున్నాడు. నా మెడకు ఓ కాడి వుంది, నేనూ చుట్టూ తిరుగుతూనే వున్నా. నాకూ దానికీ ఏమీ తేడాలేదు లోపల లోపల సణుక్కుంటున్నాడు.

తల విదిలించేసి కళ్ళార్పుతున్నాడు. ఎప్పటిమాటో హఠాత్తుగా గుర్తుకొచ్చిందే నిజంగా యిదంతా మా అమ్మే చేసింది! నాకు నచ్చిందన్న తర్వాత మా అమ్మ వద్దంటానికి కారణమేమిటి. ఈ మాట కొంచెంపైకి బాగా ఉద్రేకంగానే అన్నాడు. చప్పున తమాయించుకుని అటూ యిటూ చూశాడు. ఎవ్వరూ లేరు అని సమాధానపడ్డాడు.

ఏం... కాస్త లావవుతే యేం ! ఆ అమ్మాయి యిప్పుడు నిక్షేపంగా కాపరం చెయ్యటంలా ! ఏం లోపం వచ్చిందని, ఆ సంబంధమే నా కయివుంటేనా మన తడాఖా చూపించేవాళ్ళం. అరండల్ పేటలో మేడ, బ్రాడీపేటలో రెండు మండువాయిళ్ళు కొరిటిపాడులో స్థలం, పరిమిలో నాలుగెకరాల మాగాణి. ఇంకా డబ్బెంతుందో లెక్కేలేదు: తలుచు కుంటుంటే యివ్వాల్టికికూడా ఏడుపొస్తుంది. చేతులారా చేసుకున్నాను.

ఇంతకీ అదృష్టం వుండద్దూ.

ఛీ, అయినా ఒకళ్ళ ననటం యెందుకు. అసలు నేను పెళ్ళి చేసుకోననేచెప్పా. నా మాట వింటేగా. నా ప్రాణంతీశారు పెళ్ళిచేసుకొనేదాకా. అందులో మా నాయనమ్మ మరీను. నాయనమ్మ కోసం నేను పెళ్ళిచేసుకున్నానండే నవ్వుతారని వూరుకుంటున్నాంగాని నిజానికి జరిగిందంతే. ఆవిడ చచ్చి స్వర్గానికి వెళ్ళింది. నన్ను బతికించి నరకానికి తోసింది.

రాజశేఖరం వూగిపోతున్నాడు. ఆయన మెదడులోకి ఎన్నెన్నో సంఘటనలు దృశ్యాలు వచ్చేసి కలవరపెట్టేస్తున్నాయి. ఉక్కిరిబిక్కిరయి పోతున్నాడు. మధ్య మధ్య కిర్రు కిర్రుమనే శబ్దం తనకు తెలియకుంటానే చెవుల్లోకి వచ్చేస్తోంది.

ఏమి జీవితం! ఏమిజీవితం! ఎట్లాంటి వాణ్ణి ఎట్లా ఆయిపోయాను. అలారం కొడుతున్న గడియారం మాడుమీద చప్పగా చరిచి విప్పిన పుస్తకం గుండెల మీద పెట్టుకుని గుర్రుమని నిద్రపోయిన రోజులవి. నేనేదో కాలేజీలో వెలగ పెడుతున్నానని ముక్కాని కార్డు రాస్తే వంద రూపాయలు మనిఆర్డరు వచ్చేది. పూర్ ఫాదర్. పాపం నామీద ఆయనకు ప్రేమే తప్ప యింకోటి తెలీరు. ఏమోయ్ శేఖర్ యింకా నిద్రేనా బెడ్ కాఫీ వచ్చింరి అని తల్పశాయి నిద్రలేపాడు. అంతవరకు ఇంత ప్రశాంతంగా హాయిగా నిద్రపోయేవాణ్ణి!

ఇప్పుడా సరేలే. ఇంకా తెల్లరకముందే నిద్రమంచం మీదనుంచి వులిక్కిపడి లేచి చావాలి. పాలా ...పాలో... దూధ్‌వాలా అరుపులు. అంతకంటె యెక్కువగా కుక్కల అరుపులు. చకచక మంచంమీదనుంచి వీధి తలుపు తీసి పాలసీసాలు లోపల పెట్టాల్సిందే. లేచినవారు యెట్టాగో

లేచారు, ఆ కాఫీ డికాషన్‌కూడా కాస్తతీసివుంచుతే చేతులు అరిగిపోతాయా. అసలు ఆ చెప్పటంలో సరసం చూడండి. అవును నిజానికి నా చేతులు అరిగిపోవు. ఆఫీసులో చేసే చాకిరీకి పోల్చిచూస్తే అరిగిపోని మాట నిజమే.

ఉలిక్కిపడ్డాడు రాజశేఖరం. చర్నాకోలు చప్పుడు గట్టిగ వినిపించింది. చప్పున కిటికి తలుపులు తెరిచాడు. ఎద్దు మొండికేసింది. కదల్లేకపోతోంది. కిందకూర్చుంది. నాంచారయ్య నిలబడి దాన్ని నానా హింస పెడుతున్నాడు. కాని కదలటంలేదు. కదల్లేకపోతోంది. వంగి వంగి దానితోకను మెలిపెడుతున్నాడు. గడ్డిమంట పెట్టి అదిలిస్తున్నాడు. హడలిపోయి భయంగా లేచినిలబడింది. నాంచారయ్య మొహం విప్పారింది. మళ్ళీ యిరుసు పక్కన కూర్చుని హాయె... హాయ్ అంటున్నాడు బుసలు కొడుతూ కళ్ళవెంబడి నీళ్ళు కారుస్తూ ఎద్దు మళ్ళీ అడుగుదీసి అడుగు వేస్తోంది.

రాజశేఖరం మనస్సు వికలమయిపోయింది. అబ్బ భరించలేము. నోరులేని జీవిగదా అని ఆట్లా కాల్చుకుతింటంమహాపాపం, మహా ఘోరం ...ఫ్చ...మ్చా...పెద్ద నోరుంది నాకు నలుగుర్లో నిలబడి గంటలతరబడి ఉపన్యామమివ్వగలను. ఆర్యభట్టు దగ్గర్నుంచి అంగారక గ్రహందాకా నాకు తెలియని విషయంలేదు. అసలా మాటకొస్తే ఆ రోజుల్లో నేను కాలేజీలో చదివే రోజుల్లోనే నా జనరల్ నాలెడ్జికి లెక్చరర్స్ దంగయిపోయే వాళ్ళు. ఏంలాభం, నా తెలివితేటల్ని ఉపయోగించుకునే అదృష్టం అటు పబ్లిక్ సెకార్‌కు లేదు. ఇటు ప్రయివేటు సెక్టారుకు లేదు. ఇది

నేషనల్ వేస్ట్, కలాసల్ వేస్ట్!

అయినా నేనొక్క పొరపాటు చేశాను. రాజశేఖర్ తాను చేసిన తప్పును మొట్టమొదటి సారిగా తనలో తాను విప్పుకుని చాలా తీవ్రంగా పశ్చాత్తాప పడుతున్నాడు. తాను ఊహించింది రైటని, తాను చేసిందే సబబని యెంత సేపైనా ఎడతెగక వాదించే సమర్థత వున్నవాడు యీనాడు తనలో తాను సర్దుబాటు చేసుకుంటున్నాడు. నిక్షేపం లాంటి "ఎసైన్‌మెంట్" ను పోగొట్టుకున్నాడు. అబ్బ ఫాక్స్‌స్టెప్ కింది పెదిమను పంటితో గట్టిగా బిగించేసి కసిగా చూస్తున్నాడు.

పోన్లే ... నేను ఒకరికింద పని చెయ్యటమా! అబ్సర్డ్! అనుకున్నాను. నా వ్యూస్ డిఫరెంట్‌గా వుండేవి. ఉద్యోగం స్త్రీ లక్షణం అనుకుని దగ్గర కొచ్చిన దాన్ని కాలదన్నేశాను. అది పెద్ద బ్లండర్. నోరు యింతగా తెరిచి తల పైకెత్తాడు. ఎదురు గోడమీది వేలాడుతున్న అద్దంలో తన మొహం వికృతంగా కనిపించింది. మొహం చిట్లిస్తూ వింతగా చూస్తూ నిలబడ్డాడు.

ఏమిటట్లా అయిపోయ్యాను అనుకున్నాడు. మొహంలో మడతలు బాగానే వచ్చేసినాయే. నూనె రాసుకుంటే తెలీటం లేదు. తలంతా తెల్లబడి పోతోందే. కొంపతీసి ముసలి వాణ్ణవుతున్నా నేమటి! అయినా నే నివ్వాల్టి వాణ్ణా! ఆగష్టు మూవ్‌మెంటప్పుడే పదహారేళ్ళున్నాయి. తనలో తాను సమాధాన పడ్డాడు. అసలు నేను మరిచే పోదామను కుంటుంటేనే అవే జ్ఞాపకం వస్తాయె నాకు అదేం కర్మో!

నా కాళ్ళకు గొలుసులు వెయ్యలేదు. నా మెడమీద కాడి పెట్టలేదు అంతే! అంతమాత్రంచేత నేను స్వేచ్ఛగా స్వాతంత్ర్య వాయువులు పీలుస్తున్నానని యెవరైన అనుకుంటే అంతకంటే పొరపాటు యింకోటిలేదు. వెధవ నిన్నగాక మొన్న ప్రమోషన్ వచ్చింది. రామనాథానికి అంత పొగరా!

'ఏమోయ్'అంటాడా నన్ను నలుగుర్లోను. ఈ పదికవర్లు డిస్పాచ్ చేసిమరీ యింటికి వెళ్ళ మన్నారండీ అని యాదగిరి చేత తాఖీదు పంపిస్తాడా! ఎమర్జన్సీ కాబట్టి బతికి పోయాడు! లేకపోతే యేం చేసేవాణ్ణో! అయినా మెత్తనివాణ్ని చూస్తే ప త్తబుద్ధి పుడుతుందని! అదివరకు మాత్రం నన్ను సీటులోంచి కదల్నిచ్చేవాళ్ళా! ఎంతెంత పని చేశాను. ప్రొబేషనరీ పీరియడ్ అని, హడలు కొట్టేసే వాళ్ళు. ఆరునెల్లయింది. ఏడాదయింది. ఆ పీరియడ్‌కు అంతులేదే. పిటిషన్స్ పెట్టగా పెట్టగా కన్‌ఫర్మ్ అయ్యేటప్పటికి తాతలు దిగివచ్చారు. వెధవ ఉద్యోగం మనం చేసే చాకిరీకి వీళ్ళిచ్చే జీతానికి పొత్తెక్కడ. దానికి నాలుగు రెట్లు యెక్కువిచ్చినా దండగలేదు. వినే నాధుడెవ్వరు! అసలు చెయ్యని వాని పని బాగానే వుంది. వాన్నడిగే దిక్కెవ్వరు! ఈ అంతరాలు యెప్పుడూ వుంటూనే వుంటాయి.

రాజశేఖరానికి తాను కొత్తగా ఉద్యోగంలో చేరిన రోజులు స్ఫురణకు వచ్చినాయి

అదుగో పదిగంటలవుతోంది, అనుకోవటం ఆదరా బాదరాగా నోట్లోనూ ముక్కులోనూ మెతుకులు వేసుకోవటం ఉరుకులు పరుగులు తీయటం. రొప్పుతూ ఆఫీసులో ప్రవేశించానో లేదో అయ్యగారు రమ్మంటున్నారండీ అని అక్కడి కక్కడే పిలుపు. ఇంకా అయిదు నిమిషాలు టైము వుండనే వుంది. ఇన్ని ఫైళ్ళు యిన్ని కాగితాలు నాకప్ప చెప్పేసే వాడు. ఇహ ఆరోజుకు గ్రాసం పూర్తయింది. సాయంత్రం అయిదింటివరకు ... అయిదేమిటి కర్మ ఆరు ... ఏడూ ... ఎనిమిదికూడా అయిన రోజుల్లేవూ. ఖచ్చితంగా పని చెయ్యాల్సిందే. డ్యూటీ సమయంలో యెవ్వరితోనూ మాట్లాడ కూడదు. అధికారులకు ఎదురు చెప్పకూడదు. వాళ్ళన్నదే వేదం. అదితప్పయినా సరే. సరే అనాల్సిందే! లేటుగా రాకూడదు. పెందరాళే వెళ్ళకూడదు.

ఆఫీసర్లు చెప్పిందే సబబు. వాళ్ళతాఖీదులు అమలుపర్చటమే విధ్యుక్త ధర్మం. లేకపోతే మెమోస్, ఛార్జ్‌షీట్స్, డొమెస్టిక్ ఎన్‌క్వైరీస్, చివ్వరకు డిస్మిసల్, అందాక నడుస్తుంది కథ. ఇవన్నీ నాకొద్దు బాబు. చెప్పింది చెయ్యటం, వద్దన్నది మానటం. ఈ రెండే పాయింట్లు నాకు.

రాజశేఖరం క్షణంలో ఉద్రిక్తుడయి పోయాడు. అవునూ! నాలో రగిలే నిప్పు కణాలు అన్నీ యేమయి పోయినాయంట. ఉగ్రవాది, ఉగ్ర స్వరూపం అని నన్నంటూ వుండేవాళ్లే. ఇప్పటి మాట కాదు. అప్పటికింకా మనకు స్వాతంత్ర్యం రాలా ... అయినా ఇప్పటి కొచ్చిం దేమిటి నాకు! ప్రతివాళ్ళతో నే వాదాల్లోకి దిగేవాణ్ణి. ఎవ్వరితోనూ పడేదికాదు. అందరి తోనూ ఘర్షణే. అసలు నా జోలికి రావాలన్నా నాతో మాట్లాడాలన్నా హడలి చచ్చేవాళ్ళు. అదంతా యేమయింది. ఈ రోజు శేఖరానికి యిది రెండో జన్మ. అప్పటికీ యిప్పటికీ పోల్చి చూసుకుంటే మతిపోతుంది.

నిజానికి ఆ డొమెస్టిక్ సర్వెంట్ పోచమ్మ నయం. వచ్చిననాడు వస్తుంది లేనినాడు లేదు. ఎందుకు రాలేదే యివ్వాళ అంటే నాకు తలకాయ నెప్పొచ్చిందమ్మా అని విసురుగా సమాధానం చెపుతుంది. నోరు మెదప టానికి వీల్లేదు. ఆమెగారు నోరూరుకోక గట్టిగా యేమన్నా అన్నదా అంటే నాలుగు రోజులు నాగా పెడుతుంది. దాంతో రోగం కుదురుతుంది. వచ్చినట్లు పన్లన్నీ చేసుకోవాలి, నెలవంగానే జీతం మొత్తం యిచ్చె యాల్సిందే, లాస్ ఆఫ్ పే అంటూ లేదు! అక్కడ లీవ్ పెడితే శాంక్షన్ చెయ్యరు, ఆబ్సెంటవుతే డబ్బివ్వరు. ఇన్ని వత్తిళ్ళలో యింత టెన్షన్‌లో జీవితం గడుపు తున్నానంటే నా పేషన్స్‌కు మెచ్చుకోవాల్సిందే! నన్నె వ్వరూ గుర్తించక్కర్లేదు. గవర్నమెంటువారు బిరుదేమీ ఇవ్వక్కర్లేదు. కనీసం కాస్తంత సానుభూతి చూపిస్తే చాలు, అదే లేదు.

ఇంత మార్పు రావటానికి కారణం యెవ్వరు! ఎవ్వరు! ఎవ్వరు

బిగ్గరగా ఆరిస్తే సమాధానం వస్తుందేమిటి !

రాజశేఖరం నింపాదిగా ఆలోచించాడు. ఇదంతా కాలంచేసిన మిస్చీఫ్! అనుకున్నాడు, యెంతో సాత్వికంగా. కుర్చీలో కూర్చున్న వాన్ని ఒక్క పెట్టున తోసేసినట్టుగా వచ్చింది ఆలోచన. విసృరున కసిగా కంకర రాయితో జమీందారుగారి వీధి తలుపును రైతుకూలీ కొట్టినట్టుగా గుండెమీద పెద్ద చరుపు చరిచినట్టయింది. కాలంకాదు నా కర్మ అంటూ పల్లు పటపట మనిపించాడు.

గానుగెద్దు తిరగటం మానేసినట్టుంది. చప్పుడేమి వినిపించటంలా కిటికీలోంచి తొంగిచూశాడు, రాజశేఖరం. ఎద్దు నిలబడివుంది. నాంచారయ్య కింద కూచుని అన్నం తింటున్నాడు. ఎద్దు జనప కట్టెను దివడల కింద పెట్టి నెమరేస్తోంది. ఓ ముసలాయన సీనారేకు డబ్బా తెచ్చి నూనె తోడుతున్నాడు. కాసేపు అట్లాగే చూస్తూ నిలబడి పోయాడు. ఈముసలాయన్ను చూస్తుంటే రాజశేఖరానికి తన మామగారు కనిపించినట్టయింది. కిటికీ తలుపులు రెంటినీ ఒక్కసారిగా బలంగా నొక్కేసాడు.

డబ్బుపెట్టి నన్ను కొన్నానంటాడా! ఎంత గర్వం! కట్నం నిషేధం అమలులోకి రాకముసుపు నా పెళ్ళవటం తప్పవుతే కట్నం తీసుకోవటం కూడా తప్పే. కట్నం తీసుకోవటం ఆనాడు ఒక ప్రిస్టేజ్ ఇస్యూ. ఎంత ఎక్కువ తీసుకుంటే అంత గొప్పవాడన్నమాట. ఆయనగారు యింత దూరం ఆలోచిస్తారని నేనెన్నడూ అనుకోలేదు. ఆ రోజుల్లో కూడా కట్నాలు లేకుండా పెళ్ళిళ్ళు చేసుకున్న స్వాతంత్ర్య యోధులున్నారు. కాని కట్నానికి యింత అర్థం వుంటుందనికాని దాని వెనకాల యింత కుట్ర వుందని కాని నాకు తెలియదు.

ఇంతకీ అవసరానికి డబ్బు పంపించ మన్నందుకేగా డబ్బు పంపలేదు, పైగా మాటలు మాత్రం జోరుగా రానిచ్చే శాడు. చచ్చినట్లు నేనే

కుటుంబాన్ని పోషించాల్లి! డబ్బు తీసుకుని పెళ్ళి చేసుకున్న తర్వాత పెళ్ళాం పిల్లల్ని పోషించాలని తెలీదు. అప్పుగా యివ్వమని యిప్పుడు రాయటం, తర్వాత మెదలకుండా వూరుకోవటం. ఈయనివ్వాళ అప్పు చేస్తే తర్వాత ఎట్లా తీరుస్తాడు! ఏమిటవన్నీ. ఇవ్వటం యిష్టంలేదు యివ్వటంమానాలి. అంతేగాని నానా మాటలు అంటానికి ఆయనకు అధికారం యెవ్వరిచ్చారో, ఎంత ధీమా! ఎంత అహం! అసలు పెద్ద పొరపాటు చేసింది నేను. ఆ కట్నం తీసుకోవటంతో వచ్చింది యిదంతా. లేకపోతే ఆయన్ని ఒకాట ఆడించేవాణ్ణి. ఏమయినా యిప్పుడు ఆకులు పట్టుకుంటే యేం లాభం!

కిర్రున చప్పుడయింది. మళ్ళీ తిరగటం ప్రారంభించిందన్న మాట. ఈ తిరుగుడుకు అంతులేదు. బతికున్నంత వరకూ అంతే. ఈ ఎద్దుపోతే యింకో యెద్దొస్తుంది. నాంచారయ్య పోతే యింకో అయ్య వస్తాడు. ఈ భ్రమణం తప్పదు. భూమి తనచుట్టూ తాను తిరుగుతున్నంత వరకు యిట్లా అందరూ ఏదో రకంగా తిరుగుతూ వుండాల్సిందే!

తళుక్కున ఆలోచన మెరిసింది. ఆఫీసులో కట్టుబడి ముప్పయి రోజులు పనిచేస్తే ఫస్టుకు జీతం అంటూ యిస్తారు. ఆ డబ్బుకోసం నేను తప్పని సరిగా పని చెయ్యాల్సిందే. పని చేస్తేనే డబ్బిస్తారు. పని మాన టానికి వీల్లేదు. పని మానేస్తే యింట్లో ఘోష బయలుదేరుతుంది. అందు కని ఆ వత్తిడికి తట్టుకోలేక ఆఫీసులో అంటి పెట్టుకుని వుండాల్సిందే! ఇదీ ఓరకంగా బానిస బ్రతుకే! ఇసలు యే ఉద్యోగం చెయ్యకుండా జరి పించుకునే వాడిదే అదృష్టం. ఈలెక్కలో చిట్టెమ్మ మొగుడు చాలా అదృష్ట వంతుడు. ఇల్లరికం వెళ్ళాడు. హాయిగా బ్రతికి పోయాడు. పంజరంలో చిలకని నలుగురూ ఎగతాళి చేస్తారుగాని ఆ బ్రతుకే హాయి. చీకూ చింతా లేదు. మనిషికికావాల్సింది తిండిబట్టా వుండటానికి యిల్లు. ఈమూడూవున్న

తర్వాత వాడి బతుకు రాజాబతుకు. అప్పటి రాజా వేరు ఈనాటి రాజు వేరు. పరుగెత్తటంతోనే సరిపోతోంది. అవును నాకూ స్వాతంత్ర్యం వచ్చింది. ఐతే ఆర్థిక స్వాతంత్ర్యంరాల. దానికోసమే యీపరుగులు, ధరలతోపాటు యెంతసేపని పరుగెత్తుతాం. కాళ్ళు చచ్చుపడతాయి. ఇహ కూచోక తప్పదు ఇంకేం యిదే ఛాన్స్ ధరలు గబ గబ ముందుకు పోతాయి. ఈ రన్నింగ్ రేసులో మనం యెప్పుడూ మనం వెనకాలే. అందుకనే మన కే వస్తువులూ దొరకవు. దొరికినవి మనకు సరిపోవు.

రాజశేఖరం పూర్తిగా అలసి పోయాడు. ఎంత ఆలోచించినా తన సమస్యేమిటో అర్థం కావటం లేదు. పరిష్కారం అంత కంటే అగమ్య గోచరంగా వుంది. అసలు ఆలోచించటం మానేసిననాడు మనిషి బాగు పడుతాడు. దేశం బాగుపడతుంది. అనుకున్నాడు.

అవును నాకెవ్వరితో తగాదా ! ఎవ్వరితోనూ తగాదా లేదు. పేచీ లేదు. నాకు నాతోనే పోట్లాట. ఎప్పటి కప్పుడు ఏదో అనుకుంటూనే వుంటా. తీరా అమలులోకి వచ్చేటప్పటికి అవన్నీ మరిచే పోతూ వుంటా. ఇట్లా యెందుకు అవుతోందో తెలీట్లా ... రాజశేఖరం తీవ్రంగా మథన పడుతున్నాడు.

ఈ జీవితం యిట్లాగే వెళ్ళిపోతుంది. నాదికూడా ఒక రకంగా గాను గెద్దు జీవితమే ! అనుకుంటూనే చటుక్కున రాజశేఖరం ఆగిపోయాడు. దొంతర్లు దొంతర్లుగా ఆలోచనలు వచ్చేసి రాజశేఖరాన్ని ఊగించేస్తు న్నాయి. ఉప్పెనలా ఏదో మీదకొచ్చి పడ్డట్టయింది. కదలక మెదలక నిటారుగా నిలబడిపోయాడు.

మా మామగారు నన్ను కొన్నందుకు గాను నేను వాళ్ళమ్మాయికి సేవచేస్తూ ఆ బాకీనంతా అసలు ఫాయిదాలతో తీర్చుకోవాల్సిందే. నేను రుణపడివున్నా గనక ఆ బాకీ, తీర్చేంత వరకు ఆ యింటి పట్టునే

వుంటూ నా శాయశక్తులా చాకిరీ చెయ్యాల్సిందే. నేను యిల్లు వదలటానికి వీల్లేదు. ఊరు వదిలిపెట్టి వెళ్ళటానికి అసలే వీల్లేదు. నాకు జీతంభత్యం అంటూ వేరే యేం లేదు. రెండుపూట్ల భోజనం పెడతారు. చేసిన అప్పులు చాలక పోవటం వలన మళ్ళీ అప్పు చెయ్యాల్సి వస్తుంది. దానికి మళ్ళీ వడ్డీ పెరుగుతుంది. వడ్డీ ముందుగా తీర్చటానికిగాను అప్పు చెయ్యాలి. ఇదంతా పెద్ద విషవలయంలాగ తయారయింది. దీంట్లోంచి తప్పించుకుని బయట పడలేము, అనుకుంటూ గభాలున కిటికీ తలుపులు రెంటినీ బార్లాగా తీసేశాడు.

గానుగెద్దు చుట్టూ తిరుగుతూవుంటే తానుకూడా ఆ గదిలో చుట్టూ గిర గిర తిరిగేస్తున్నాడు. వికటంగా పెద్ద పెట్టున నవ్వుతూ తనలో తాను ఆనంద పడిపోతున్నాడు. ఇది నిజమైన సంతోషంకాదు. వికటాట్టహాసం. వళ్ళు పై తెలీక ఎగిరెగిరి గంతులేస్తూ గభాలున రేడియో స్విచ్ ఆన్ చేశాడు.

'....... కేంద్ర ప్రభుత్వంవారు వెట్టిచాకిరీని రద్దుచేస్తూ చట్టాన్ని అమలు లోకి తీసుకు వచ్చారు. దీని వలన తరతరాల్నుంచి వెట్టిచాకిరీ చేస్తూ బానిసల్లా బ్రతుకుతున్న వారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించి, నాయి. ఈ చట్టం అమలులోకి రాంగానే అనేక మందిని విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాలో ముగ్గుర్నీ, కడప జిల్లాలో నలుగుర్నీ విశాఖపట్నం, జిల్లాలోయిద్దర్నీ విడుదలచేశారు. హైదరాబాదులోయాదగిరిని,ముత్యాలులో వేద్రాదినీ, అనకాపల్లిలో సింహాచలాన్ని కూడా విడుదల చేశారు .......'

నోరు అప్పచెప్పి అతి శ్రద్ధగా వింటూ 'మరి నా మాటో' అను కున్నాడు రాజశేఖరం పక్కున నవ్వుతూ.

****